హోరాహోరీగా ఆడుదాం ఆంధ్ర పోటీలు

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీలు గురువారం మూడు రోజుకు చేరుకున్నాయి. ప్రస్తుతం సచివాలయ స్థాయిలో జరుగుతన్న పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మూడో రోజు కబడ్డీ పోటీలు నిర్వహించారు. వివిధ సచివాలయాల పరిధిలో పేర్లు నమోదు చేయించుకున్న యువకులు కబడ్డీ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. కబడ్డీ పోటీలకు మొత్తం 24 టీమ్‌లు నమోదు చేసుకోగా, 12 మ్యాచ్‌లు నిర్వహించారు. అంపైర్‌లుగా వినయ్, జయరాజు వ్యవహరించగా, గ్రౌండ్ ఇన్‌చార్జ్‌గా తనూజ్ కుమార్ వ్యవహరించారు. కమిషనర్ పి.భవానీప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ వెంకటరమణ, ఆర్ఐ సుబ్బారావు, సచివాలయాల అడ్మిన్‌లు, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులతో కళకళలాడాయి. కొయ్యలగూడెం ప్రభుత్వ బాలుర హైస్కూల్లో బాలికలకు కబడ్డీ, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు జరిగాయి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీహెచ్ సత్యనారాయణ క్రీడలను పర్యవేక్షించగా పీడీ, పీఈటీల సమక్షంలో క్రీడలు కొనసాగాయి. బయ్యనగూడెం, రాజవరం, కన్నాపురం, పొంగుటూరు, వేదాంతపురం, బోడిగూడెం, గవరవరం హైస్కూళ్ల క్రీడా ప్రాంగణాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు సందర్శించి ఆటలలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.


జంగారెడ్డిగూడెం: జెడ్పీ బాలుర హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం


కొయ్యలగూడెం: బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కబడ్డీలో పోటీపడుతున్న బాలికలు


చింతలపూడి: ప్రగడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో ఖోఖో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం రూరల్: పట్టిన్నపాలెంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యత

చింతలపూడి: ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు ఎంపీడీఓ మురళీకృష్ణ తెలిపారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా గురువారం ప్రగడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో క్రీడాకారులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం నేరుగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రూపొందించి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆటల పోటీల వల్ల ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పోటీలు ముమ్మరంగా సాగుతున్నాయి.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల క్రీడా మైదానాల్లో ఆడుదాం - ఆంధ్ర ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. లక్కవరం, గురవాయిగూడెం, దేవులపల్లి, పట్టిన్నపాలెం, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ పోటీలను నిర్వహించారు. పట్టిన్నపాలెంలో సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్ అంశాల్లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి ఆ పై విద్యార్హత గల 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఫోన్ నెంబర్లు 99485 65256, 95027 23561లో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం నేరుగా సంస్థకు వచ్చి ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, మూడు కలర్ పాస్‌పోర్ట్ ఫొటోలు సమర్పించి, ప్రవేశాలు పొందాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు కోరారు. బుట్టాయగూడెం శివారు నందాపురం శివారులో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.50 కోట్ల వ్యయంతో మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులకు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ పనులు పూర్తయితే వైద్యం కోసం బయట ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతంలోని ప్రజలకు విద్య, వైద్యం అందించే దిశగా ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ సరియం లక్ష్మి, ఎంపీటీసీ తెల్లం రమణ, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, మొడియం లక్ష్మి, తెల్లం వెంకటలక్ష్మి, మడకం రామలక్ష్మి, బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు మొడియం వెంకమ్మ, గాలి దుర్గారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల వివరాలను మ్యాప్ ద్వారా తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు విజ్ఞప్తి చేశారు. కళాశాలలో గురువారం వినియోగదారుల హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేడు వినియోగదారులు చట్టాలపై అవగాహన లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినియోగదారులకు రక్షణ చట్టాలు ఉన్నాయని, అవసరమైన సందర్భాలలో వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనేది వివరించారు. వినియోగదారుల కౌన్సిల్ మండల అధ్యక్షుడు కుకునూరి రామచంద్రరావు, కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఆర్.భాస్కరరావు మాట్లాడుతూ వినియోగదారుల తీర్పులకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పుపై సంతృప్తి చెందనట్లయితే పైకోర్టులకు ఏ విధంగా అప్పీలు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.మధు, అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, హనుమంతరావు, డా.కె.ఉత్తమ్ సాగర్, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కోడిపందేలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి


నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

నిడమర్రు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయం పేరిట గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. గురువారం నిడమర్రు పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు మరో మూడు నెలల్లో నిర్వహించే అవకాశం ఉన్నందున సిబ్బంది తగిన విధంగా పోలీంగ్ కేంద్రాల వివరాలు, సమస్య, అతి సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లోని మహిళా పోలీస్‌ల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏడీఎస్పీ శ్రీనివాసరావు, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, నిడమర్రు, గణపవరం, చేబ్రోలు ఎస్సైలు ఆర్.శ్రీను, వెంకటేశ్వరరావు, మణికుమార్ ఉన్నారు.

వర్జీనియా పొగాకు తోటల పరిశీలన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలో పొగాకు తోటలను ఫీల్డ్ ఫ్రెండ్స్ బృందం గురువారం పరిశీలించింది. దిప్పకాయలపాడు, కన్నాపురం, అచ్చియ్యపాలెం, కండ్రికగూడెంలో గ్రామాలను సందర్శిస్తూ రైతులతో సంభాషించారు. రాజమండ్రి ప్రాంతీయ అధికారి ఎం.ఆదిశేషయ్య ఆధ్వర్యంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్తల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా డాక్టర్ వై.సుబ్బయ్య, కొయ్యలగూడెం ఆక్షన్ సూపరింటెండెంట్ ఎం.గ్రేస్‌మార్గరెట్ పొగాకు తోటలు స్థితిగతులు గమనిస్తూ, మిచాంగ్ తుపానుకు దెబ్బతిని కోలుకున్న తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. బోర్డు అధికారుల సూచనలతో పాటు కంపెనీ ప్రతినిధుల సూచనలు సలహాలు పొందవలసిందిగా అందుకు సంబంధించిన సమాచారం గురించి రైతులకు అందజేశారు.


కన్నాపురం సమీపంలో పొగాకు తోటలను ఫీల్డ్ ఫ్రెండ్స్ బృందం పరిశీలిస్తున్న దృశ్యం

అరెస్ట్‌కు ముందు ఉచిత న్యాయ సాయం

ఏలూరు రూరల్: నేరం మోపబడిన వ్యక్తి అరెస్ట్ అయ్యే ముందు న్యాయసేవాధికార సంస్థ నుంచి ఉచిత న్యాయ సాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో న్యాయసేవాధికార సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, కర్మాగారాలు, విద్యా తదితర సంస్థల్లో లింగ వివక్ష చూపించిన వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేన్నారు. వివక్షకు గురైన వ్యక్తులు ఎవరైన న్యాయ సాయం పొందవచ్చన్నారు. మరో అధికారిణి సూర్యచక్రవేణి మాట్లాడుతూ చిన్నపిల్లలకు బాల్య వివాహం, వెట్టిచాకిరి, బిక్షాటన చేయించడం నేరం అన్నారు. అలాంటి వారు చట్టం దృష్టిలో శిక్షార్హులవుతారని చెప్పారు. అనంతరం న్యాయాధికారులు స్థానిక జెడ్పీ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ప్రణవి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ముగిసిన హనుమద్ వ్రత మహోత్సవాలు

కొయ్యలగూడెం: శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి హనుమద్ వ్రత మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. బయ్యనగూడెం, సరిపల్లి గ్రామాల మధ్య స్వయంభుగా వెలసిన సంజీవ ఆంజనేయస్వామి ఆలయంలో 24వ తేదీన ఉత్సవాలు ప్రారంభం కాగా ఐదు రోజులపాటు విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్గీయ మిరియాల వెంకటరావు జ్ఞాపకార్థం వంశపారంపర్య ధర్మకర్తలు 4 వేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం రాత్రి సువర్చలా సమేత శ్రీ హనుమాన్ కల్యాణోత్సవం ఆలయ అర్చకులు పొన్నా గణపతి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 108 మంది భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం చేపట్టి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అంకాలగూడెం, కన్నాపురం ఆలయాల వద్ద అన్నసమారాధన, ముగింపు ఉత్సవాలు నిర్వహించారు.


ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సామూహిక పారాయణ

వైభవంగా శాంతి కల్యాణం

భీమడోలు: గుండుగొలనులోని ప్రసిద్ధి చెందిన శ్రీ సీతారామస్వామి ఆలయంలో గురువారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగా రాజ్‌కుమార్ ఆధ్వర్యాన యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ పూజారి సాయి సుధీరాచార్యులు శ్రీరామ జపం చేస్తూ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీరామ అక్షితల కలశాలను భక్తులకు ప్రసాదించేందుకుగానూ ఆలయంలో స్వామివారి ఎదుట ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని జరిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

ఏలూరు టౌన్: స్థానిక నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు కార్పొరేషన్ పర్మినెంట్ పబ్లిక్ హెల్త్ విభాగ కార్మికులు, క్లాస్-4 ఉద్యోగులకు ఏలూరు మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చేతులమీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. పబ్లిక్ హెల్త్, క్లాస్-4 ఉద్యోగులు 286 మంది కార్మికులకు ఏటా మాదిరిగానే యునిఫాం అందజేశారు. మహిళా కార్మికులకు మూడు చీరలు, 3 జాకెట్లు, మగవారికి రెండు జతల దుస్తులు, రెండు జతల చెప్పులు, 3 టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్మికులకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, సబ్బన శ్రీనివాసరావు, కలవకొల్లు సాంబ, బత్తిన విజయకుమార్, కోఆప్షన్ సభ్యులు నీతాజైన్, హెల్త్ ఆఫీసర్ మాలతి, సెక్రటరీ ప్రభుదాస్, పార్టీ నాయకులు జిజ్జువరపు రమేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ


పోలవరంలో ఆంజనేయస్వామికి తమలపాకుల పూజ నిర్వహించిన దృశ్యం

పోలవరం రూరల్: హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పోలవరంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం లక్ష తమలపాకుల పూజా కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి, లక్ష తమలపాకుల పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే గూటాల గ్రామంలోని అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఏర్పడిన మహిళా కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: హ్యూమన్ రైట్స్ మిషన్ (హెచ్ఆర్ఎం) ఆధ్వర్యంలో గురువారం జంగారెడ్డిగూడెంలో మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హెచ్ఆర్ఎం మండల అధ్యక్షుడు హనుమంతరావు, కార్యదర్శి సత్యనారాయణ, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణాదేవి ఆధ్వర్యంలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. నూతన కమిటీకి రాష్ట్ర అధ్యక్షులుగా గంగిరెడ్ల మేఘలాదేవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఆర్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే బాజీ, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె.జయరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్ఆర్ కృష్ణబాబు నూతన కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. హెచ్ఆర్ఎం విధి విధానాలను వివరించారు.

హెల్త్ కార్డుల పంపిణీ


హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తుందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ పరిధిలోని ఇటుకలకోట గ్రామంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్త్ కార్డులను వినియోగించుకుని వైద్యసేవలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, వైద్యాధికారి మురళీధర్, మండల పరిషత్ ఏవో శ్రీనివాసబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సున్నం గంగాజలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాల విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వర్సిటీ స్థాయిలో 5 జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆర్.సూర్య మణికంఠ, పి.సాయికిరణ్, ఎస్.భీమరాజు జిల్లాలో రెండో స్థానం సాధించారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ (ఎస్ఆర్ఎం)కు ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు.

రెండో విడత ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలి

దెందులూరు: వచ్చేనెల 3వ తేదీ నుంచి ఏలూరు రూరల్ మండలంలో జరిగే ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. గురువారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఏలూరు రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని గుర్తు చేస్తూ, అలాగే వారి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజా ఆశీర్వాద యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రజలందరి ఆశీస్సులతో మొదటి విడత ప్రజా ఆశీర్వాద యాత్ర విజయవంతంగా పూర్తయిందని అన్నారు. సమావేశంలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పార్టీ ఏలూరు మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ మండల సరస్వతి కొండలరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామవరపుకోట: అంకాలంపాడు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో పెయింటింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తూరు, ఈస్ట్ యడవల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

10 మంది జూదరుల అరెస్ట్

చింతలపూడి: చింతలపూడి మండలం, సమ్మెటవారిగూడెం గ్రామంలో గురువారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.23,890 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చింతంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు నాయక్

చింతలపూడి: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ డా. బి.రాంబాబు నాయక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని చింతంపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు అధ్యక్షతన గ్రామ సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎంపీడీఓ మురళీకృష్ణ ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనార్దన స్వామికి విశేష పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పరశురామావతార అలంకరణ చేశారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.





